క్లుప్తంగా

రక్షణ గోడ నిర్మాణానికి శంకుస్థాపన

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు హనుమంతవాక వద్ద రక్షణ గోడ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈమేరకు శుక్రవారం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటర్ స్వాతితో కలిసి శంకుస్థాపన చేశారు. ఇక్కడ జాతీయ రహదారిని ఆనుకొని కొండవాలులో సుమారు రూ 37.80 లక్షలతో రక్షణ గోడతో పాటు రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. ఈ పనులు వేగంగా జరిపించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు బుడుమూరు గోవింద్, రాంబాబు, బాలరాజు, జోన్-2 కమిషనర్ ఫణిరాం, ఏఈ వెంకటరావు పాల్గొన్నారు.

కూలిన పాఠశాల ప్రహరీ.. తప్పిన ప్రమాదం


అంబేడ్కర్ నగర్‌లో గేటుతో సహా కుప్పకూలిన ప్రాథమిక పాఠశాల రక్షణ గోడ

ఆరిలోవ: జీవీఎంసీ 11వ వార్డులోని అంబేడ్కర్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల రక్షణ గోడ శుక్రవారం కూలిపోయింది. కొన్నాళ్లుగా శిథిలావస్థకు చేరిన ఈ ప్రహరీ ఒక్కసారిగా కుప్పకూలింది. సాయంత్రం 4 గంటలకు పాఠశాల విడిచిపెట్టిన కొన్ని గంటలు తర్వాత గోడ కూలడంతో విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. దీంతో పాటు నగరానికి వెళ్లే వారు నిత్యం బస్‌లు, ఆటోల కోసం ఈ పాఠశాల గోడ పక్కనే నిరీక్షిస్తుంటారు. ఇదే కూలే సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణహాని తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకొన్నారు. ఈ ప్రహరీ నిర్మించిన సమయంలో దీనికి సుమారు 300 కిలోలకు పైగా ఇనుప గేటు అమర్చారు. బరువైన ఆ గేటు ముందుకు వాలిపోవడంతో గోడ సపోర్టు కోల్పోయి ఒక్కసారిగా గేటుతోపాటు కుప్పకూలిందని భావిస్తున్నారు.

కాంటాక్ట్ లెన్స్‌ల వినియోగంపై అవగాహన

ఆరిలోవ: కంటి సమస్యలు ఉన్నవారికి కాంటాక్ట్ లెన్స్ వాడకంపై హనుమంతవాక వద్ద ఉన్న ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎల్వీపీ కంటి ఆస్పత్రి ఆప్టోమెట్రిస్ట్ గౌతమి మాట్లాడుతూ కాంటాక్ట్ లెన్స్‌లు వాడే వారికి వాటిపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. కాంటాక్ట్ లెన్స్ అనేవి వక్రీభవనం, చికిత్స కోసం, సౌందర్యం కోసం ఏర్పాటు చేసుకునే పరికరాలని తెలిపారు. కంటి చూపును సరిచేయడానికి కళ్లద్దాలకు బదులుగా వీటిని వినియోగిస్తారని తెలిపారు. కళ్లజోడుతో పోలిస్తే ఇవి చక్కటి దృష్టిని అందిస్తాయని, వీటిని అమర్చడం వల్ల కళ్లద్దాలకు ప్రతిబింబాలతో ఇబ్బంది కూడా ఉండదని తెలిపారు. నిర్దిష్టమైన చూపు కోసమే ఈ కాంటాక్ట్ లెన్స్‌ను రూపొందించినట్లు తెలియజేశారు. వీటిలో స్క్లెరెల్, కాస్మెటిక్ తదితర కాంటాక్ట్ లెన్స్‌లు ఉన్నాయన్నారు. అవసరమైనవారు కంటి వైద్య నిపుణులను సంప్రదించి కాంటాక్ట్ లెన్స్‌లు వాడాలని సూచించారు.

గెడ్డలో పూడిక తొలగింపు


రామ్‌నగర్ గెడ్డలోని పూడిక తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులోని నెహ్రూనగర్ రామ్‌నగర్ గెడ్డలో పేరుకుపోయిన పూడిక, చెత్తను పారిశుధ్య సిబ్బంది తొలగించారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు జీవీఎంసీ అధికారులతో మాట్లాడారు. దీంతో జీవీఎంసీ సిబ్బంది శుక్రవారం గెడ్డలోని పూడికను తొలగించి శుభ్రం చేశారు. సమస్య పరిష్కారం కావడంతో దుర్గారావుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

కూటమి పాలనలో అన్నీ షాక్‌లే..


నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, రవీంద్ర, మేయర్ హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- 'బాబు' ష్యూరిటీ లేదు.. అంతా బాదుడే
- విద్యుత్ భారం.. ప్రజలకు నరకం
- ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, రవీంద్రబాబు, మేయర్ హరివెంకటకుమారి
- విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా 'తూర్పు'లో వైఎస్సార్‌సీపీ పోరుబాట

బీచ్‌రోడ్డు: 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' అనే నినాదంతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 'బాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారెంటీ' అన్న విధంగా పాలన సాగిస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్సీ పి.రవీంద్రబాబు, మేయర్ గొలగాని హరివెంకటకుమారి విమర్శించారు. విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచి రాష్ట్ర ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారని పాలకులపై మండిపడ్డారు. విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా శుక్రవారం తూర్పు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పెదవాల్తేరు విశాఖ కంటి ఆస్పత్రి నుంచి ర్యాలీగా వెళ్లి అక్కడి ఈపీడీసీఎల్ కార్యాలయంలో అధికారులకు విద్యుత్ చార్జీలు తగ్గించాలని వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.15,500 కోట్ల భారం పెంచడంతో ప్రజలకు కరెంట్ షాక్ తగిలిందన్నారు. రాష్ట్ర ప్రజలందరూ చంద్రబాబునాయుడిని చంద్ర'బాదుడు' నాయుడు అని అంటున్నారని ఎద్దేవా చేశారు. బాదుడికి బ్రాండ్ అంబాసిడర్‌గా చంద్రబాబు తన పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఈ నెలలో వచ్చిన రూ.6,000 కోట్ల విద్యుత్ భారం జనం మీద వేయడం వల్ల వచ్చిన కరెంట్ బిల్లులు చూసి ప్రజలకు షాక్ తగిలిందన్నారు. జనవరిలో రూ.9,000 కోట్లకు పెరగనుండటంతో మరింతగా విద్యుత్ బిల్లులు పెరుగుతాయని చెప్పారు.

రూ.లక్ష కోట్లు ఏమయ్యాయి..?

కూటమి ప్రభుత్వ పాలకులు ప్రజలను జలగల్లా పీల్చి పిప్పి చేస్తున్నారని, మాట్లాడితే ప్రతిదానికి కారణం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పి తప్పుడు ప్రచారం చేస్తున్నారని వరుదు కల్యాణి, రవీంద్ర, హరివెంకటకుమారి అన్నారు.


ఈపీడీసీఎల్ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పి.రవీంద్రబాబు, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు


విద్యుత్ చార్జీల పెరుగుదలకు జగనే కారణమైతే మీరెందుకు తగ్గించడం లేదని ప్రశ్నించారు. ఏడు నెలల్లోనే రూ.లక్ష కోట్లు అప్పు తెచ్చారని.. దానితోనైనా ప్రజలపై విద్యుత్ చార్జీల భారం లేకుండా చేయాలన్నారు. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని, మహిళలు, రైతులు, నిరుద్యోగులు ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని, ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ ఇవ్వలేదని, ఐఆర్ ప్రకటించలేదని, అసలు తెచ్చిన లక్ష కోట్ల రూపాయల అప్పు ఏమైపోయిందని ప్రశ్నించారు. జనంపై ఎందుకు రూ.15,500 కోట్లు భారం మోపుతున్నారని రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి, కూటమి ప్రభుత్వం సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

> **కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత**
>
> కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, అందుకు ఈ నిరసన కార్యక్రమానికి ప్రజల నుంచి వస్తున్న విపరీతమైన మద్దతు నిదర్శనమని ఎమ్మెల్సీలు, మేయర్ పేర్కొన్నారు. ఎందుకు ఈ కూటమి ప్రభుత్వానికి ఓటు వేశామా.. అని ప్రజలు బాధపడే పరిస్థితి నేడు ఉందన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజలు తిరగబాటు చేయడానికి సిద్ధంగా ఉన్నారని, తక్షణమే విద్యుత్ చార్జీలు భారం తగ్గించాలని, అంత వరకు తమ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని ఎమ్మెల్సీలు కల్యాణి, రవీంద్ర, మేయర్ హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు హెచ్చరించారు.

- జీవీఎంసీ 28వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీలు ఉపసంహరించాలని నినాదాలు చేశారు. రామ్‌నగర్ నుంచి పెదవాల్తేరు వరకు పెద్ద సంఖ్యలో ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు.

జీవీఎంసీ 20వ వార్డు కార్పొరేటర్ ముప్పల లక్ష్మి సురేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు, మత్స్య శాఖ విభాగం అధ్యక్షుడు తెర్ల విజయచంద్ర, మార్కెటింగ్ మాజీ చైర్మన్ అల్లంపల్లి రాజబాబు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు రవిరెడ్డి, ఎస్.కృష్ణంరాజు, పార్టీ 20, 22, 28, 17, 13 వార్డుల అధ్యక్షులు, ఇన్‌చార్జిలు ముప్పల సురేష్, పీతల గోవింద్, పల్లా దుర్గారావు, నాగరాజు, కెల్ల సత్యనారాయణ, సీనియర్ నాయకుడు గొలగాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక భారంతో సామాన్యులు బతికేదెలా..?



రాష్ట్రంలో ఒక వైపు నిత్యావసర సరకుల ధరలు పెరిగాయని, 30% రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచారని, ఉప్పులు, పప్పులు, బియ్యం, కూరగాయలు ఇలా అన్ని రకాల ధరలు పెంచడంతో సామాన్యులు జీవించాలంటే భయంగా ఉందని ఎమ్మెల్సీలు, మేయర్ ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు తల్లికి వందనం, కాలేజీ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడం వల్ల ఫీజుల భారం తల్లిదండ్రులపై పడిందని, ఇలా అన్ని రకాలుగా ప్రజల నడ్డి విరుస్తూ కూటమి ప్రభుత్వం నరకం చూపిస్తోందన్నారు. ప్రజలకు ఎంతో మేలు చేస్తామని చెప్పి ఓట్లు వేయించుకొని నేడు నిట్ట నిలువుగా మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పడమే కాకుండా ప్రజలే కరెంట్ ఉత్పత్తి చేసి ప్రభుత్వానికి అమ్మేటట్టు చేస్తామని చెప్పి నమ్మించి ఓట్లు వేయించుకున్నారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే రాష్ట్ర చరిత్రలో గాని, దేశ చరిత్రలో గాని ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం చంద్రబాబు రూ.15,500 కోట్ల భారాన్ని ప్రజల మీద మోపడం చాలా దారుణమన్నారు.


వైఎస్సార్‌సీపీ 28వ వార్డు ఇన్‌చార్జి దుర్గారావు ఆధ్వర్యంలో ర్యాలీలో పాల్గొన్న నాయకులు

ప్రజా బాదుడు తప్పదు



రాష్ట్ర ప్రజలపై అదనంగా మోపిన విద్యుత్ చార్జీల బాదుడిని తక్షణమే తగ్గించాలి. లేకుంటే కూటమి ప్రభుత్వం ప్రజల తిరుగుబాటును చూడాల్సి ఉంటుంది. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఇక్కడి ప్రజలపై భారం మోపడం దారుణం. కరెంటు చార్జీలు పెంచమని చెప్పి అధికారంలోకి వచ్చి ఇన్ని వేల కోట్లు పెంచడం కూటమి ప్రభుత్వం తప్పుడు హామీలకు నిదర్శనం. – సంధ్య, ఇసకతోట, 16వ వార్డు

మరోసారి బాబును నమ్మి మోసపోయాం



గతంలో అనేక మాయమాటలు చెప్పి రాష్ట్ర ప్రజలను మోసం చేసిన చంద్రబాబు మాటలను మళ్లీ నమ్మి ఓటేసినందుకు మాకు సరైన బుద్ధి చెప్పారు. ఎన్నికల్లో విద్యుత్ చార్జీలు పెంచమని బహిరంగంగా ప్రకటించి.. ఇప్పుడు ఎప్పటిలాగనే ప్రజలపై బాదుడు మొదలపెట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యుత్ చార్జీలు పెంచడం దారుణం. – ఎస్.అప్పలనాయుడు, రాజీవ్‌నగర్, 22వ వార్డు

విద్యుత్ చార్జీలు తక్షణం తగ్గించాలి




రాష్ట్ర ప్రజలపై మోపిన విద్యుత్ చార్జీల భారాన్ని కూటమి ప్రభుత్వం తక్షణమే తగ్గించాలి. గతంలో వైఎస్సార్‌సీపీ అధికంగా చార్జీలు వసూలు చేస్తుందని తప్పుడు ప్రచారం చేసిన కూటమి నాయకులు.. అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే ప్రజలపై వేల కోట్ల రూపాయల భారం వేయడం దారుణం. కరెంటు చార్జీలు పెంచమని చెప్పిన ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టికోవాలి. – వై.కుమార్‌రెడ్డి, పెదవాల్తేరు, 20వ వార్డు

ప్రజలపై విద్యుత్ భారం తగదు



విద్యుత్ రంగంపై పడిన భారం ప్రజలపై వేయడం తగదు. ఎన్నికల్లో కరెంట్ చార్జీలు పెంచమని చెప్పి ఇప్పుడు వేల కోట్ల రూపాయల భారం వేయడం సరైన పద్ధతి కాదు. వేల కోట్లు అప్పు చేస్తున్న కూటమి ప్రభుత్వం ఆ సొమ్మును ఏం చేస్తోంది. సంక్షేమ పథకాలు అమలు చేయక పోగా.. నిత్యావసర సరకుల ధరలు, విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై ఆర్థిక భారం మోపడం దారుణం. – ఆర్.దశరథరామయ్య, లాసన్స్ బేకాలనీ

గోవిందనామాలు.. జీవనముక్తికి సోపానాలు


ప్రవచిస్తున్న విభీషణ శర్మ


వేషధారణలతో ఆకట్టుకున్న చిన్నారులు

ఎంవీపీకాలనీ: గోవిందనామాలు జీవనముక్తికి సోపానాలని ఆకెళ్ల విభీషణ శర్మ అన్నారు. శ్రీ సుదర్శన సీతారామాచార్యులు నేతృత్వంలో, ఉదయగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని భద్రం పార్కులో శ్రీ వేంకటేశ్వర వైభవం పేరిట నిర్వహిస్తున్న ప్రవచన కార్యక్రమం రెండో శుక్రవారం విశేషంగా సాగింది. ఈ సందర్భంగా విభీషణ శర్మ వేంకటేశ్వర వైభవంపై చేసిన ఆధ్యాత్మిక ప్రవచనాలు ఆకట్టుకున్నాయి. దేవదేవుడు శ్రీనివాసుడు కొలువైన ఏడుకొండలను సరిగమపదనిసలుగా భావించి మహోన్నత వాగ్గేయకారులైన అన్నమాచార్య, త్యాగరాజు శ్రీవారిని కీర్తించి తరించారన్నారు. వారి బాటలోనే విశ్వవ్యాప్తంగా ఉన్న భక్తులు వివిధ కార్యక్రమాల ద్వారా శ్రీవారిని కీర్తించడం, సేవించడం ద్వారా ప్రశాంత జీవనం పొందగలరని చెప్పారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన వివిధ రకాల వేషధారణలు భక్తులను అలరించాయి. కార్యక్రమ నిర్వాహకులు కందాళ అరుణగాయత్రి, డి.శ్రీనివాస్, వి.వి.ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏయూ వాలీబాల్ క్రీడాకారిణుల ఎంపిక


పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులతో ఆచార్య విజయమోహన్ తదితరులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ మహిళా వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక శుక్రవారం గోల్డెన్ జూబ్లీ స్టేడియంలో జరిగింది. ఈ సందర్భంగా వాలీబాల్ మహిళా యూనివర్సిటీ టీమ్ ఎంపిక పోటీలను ముఖ్య అతిథి ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ హెడ్ ఆచార్య జె.రవి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ మహిళా జట్టు వాలీబాల్ పోటీల్లో రాణించి ఏయూకి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ విజయమోహన్ మాట్లాడుతూ వాలీబాల్ క్రీడలో ప్రతిభ చూపిన 12 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలలకు చెందిన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వాలీబాల్ ఎంపిక కమిటీ సభ్యులు డా.వి.ఎస్. కృష్ణ డిగ్రీ, పీజీ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ లెక్చరర్ డాక్టర్ సంధ్యారాణి, ఏవీఎన్ కళాశాల పీడీ డాక్టర్ గోపీకృష్ణ, పీడీ రవి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపుతో లక్ష్య సాధన


ఆచార్య రఘు కొర్రపాటిని సత్కరిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: యువతరం తమ నైపుణ్యాలను నిరంతరం పెంపొందించుకోవాలని, తద్వారా లక్ష్యాలను సాధించవచ్చని ప్రవాస భారతీయుడు, ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి ఆచార్య రఘు కొర్రపాటి అన్నారు. శుక్రవారం ఆయన ఏయూను సందర్శించి రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏయూ తరఫున ఆచార్య రఘును రిజిస్ట్రార్ సత్కరించారు. ఆచార్య రఘు కొరప్రాటి ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో పీహెచ్‌డీ చేసి ప్రస్తుతం దక్షిణ కరోలినా రాష్ట్రానికి అటర్నీగా సేవలందిస్తున్నారు. కార్యక్రమంలో ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ డిప్యూటీ డైరెక్టర్ ఆచార్య పి.విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.




ఆనంద సాగరం.. చిన్నారుల సాహసం

ఏయూక్యాంపస్: సముద్రాన్ని చూస్తే ఎవ్వరికైనా అవధులు లేని సంతోషం కలుగుతుంది. పెద్దలు కూడా చిన్నపిల్లల్లా మారిపోతుంటారు. కెరటాలతో పోటీ పడుతూ.. ఇసుక తిన్నెలపై ఆడుకోవడానికి అమితాసక్తిని చూపిస్తారు. అదే చిన్నపిల్లలైతే వారి ఆనందానికి అవధులే ఉండవు. ఎగసిపడే కెరటాల కంటే రెట్టింపు ఉత్సాహంతో వీరు గంతులేస్తారు. శుక్రవారం ఆర్కే బీచ్‌లో ఇటువంటి దృశ్యాలే కనిపించాయి. కొంత మంది చిన్నారులు కేరింతలు కొడుతూ ఆటలాడారు. మరికొంత మంది పిల్లలు పెదజాలరిపేట బీచ్‌లో సర్ఫింగ్ చేస్తూ సందడి చేశారు. ఎటువంటి ప్రత్యేక శిక్షణ లేకుండానే వీరంతా అలవోకగా.. సాహసోపేతంగా కెరటాలపై సర్ఫింగ్ చేస్తూ అలరించారు. సాగర తీరం చిన్నారుల ఆటలతో ఆనంద సాగరంగా మారింది. ఈ మధుర క్షణాలను 'సాక్షి' కెమెరాలో బంధించింది.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం






తెలుగు భాషను కాపాడుకోవాలి

సీతంపేట: తెలుగు భాషను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, భావితరాలు మాతృభాషకు దూరం కాకూడదని ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు అన్నారు. విశ్వ సాహితి లలిత కళా వేదిక ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం శ్రీగణపతిరాజు ఈశ్వర వర్మ స్మారక సాహిత్య కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మాతృభాష గొప్పతనం, ప్రాముఖ్యతను పిల్లలకు వివరించాలన్నారు. డాక్టర్ డి.వి.సూర్యారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో పాత్రికేయులు జంధ్యాల శరత్‌బాబు పత్రికలు, సారస్వత బాధ్యత అనే అంశంపై మాట్లాడారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు శేఖరమంత్రి ప్రభాకర్, వి.నాంచారయ్య, బి.వెంకటరావు, కె.రఘువీర్ పాల్గొన్నారు.

ఖాతాదారుల సేవలో ముందుంటాం


వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

విశాఖ విద్య: ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని కోస్టల్ బ్యాంక్ గోపాలపట్నం బ్రాంచి మేనేజర్ యు.తులసీరావు తెలిపారు. కోస్టల్ బ్యాంక్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను శుక్రవారం బ్రాంచిలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పంచదార్ల శ్రీధర్, ఎం.ఎం.వి.శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తులసీరావు మాట్లాడుతూ సమాజానికి 25 ఏళ్లుగా నమ్మకమైన సేవలు అందించిన కోస్టల్ బ్యాంక్ వేడుకలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఖాతాదారుల విశ్వాసం, ఉద్యోగుల అంకితభావం మరెన్నో ఏళ్ల సేవలందించడానికి ప్రేరణగా నిలుస్తున్నాయన్నారు. సిల్వర్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా బ్యాంకు ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య నిపుణులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. పలువురు ఖాతాదారులను సత్కరించి, మెమెంటోలు బహూకరించారు.